

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

● పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్బీనగర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ సౌభాగ్యపురంకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నాటి ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు సబితారెడ్డికి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సుధాకర్‌గుప్తా, నర్సింహారెడ్డి, మూర్తి, మురుకుంట్ల అరవింద్‌శర్మ, పెండ్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, వెంకటేశ్‌గౌడ్, జైశ్రీమన్నారాయణ, మహేందర్‌రెడ్డి, శ్యాంగుప్తా, పబ్బు శ్రీనివాస్, రమేష్, లిక్కి ఊర్మిళారెడ్డి పాల్గొన్నారు.

సప్తావరణ సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కొత్తపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : స్వామివార్లకు సప్తావరణ సేవతో స్నేహపురికాలనీ గోదాసమేత పద్మావతీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిసాయి. బ్రహ్మోత్సవాల్లో సప్తావరణ సేవలో స్నేహపురి వేంకటేశ్వరస్వామి ఉభయ దేవేరులతో దర్శనమిచ్చారు. మధ్వాదుల రమాకాంతాచార్య ఆధ్వర్యంలో స్వామివార్లకు అర్చక స్వాములు విశేష పూజలు నిర్వహించారు. సప్తావరణ సేవలో వీణ, పిల్లనగ్రోవి తదితర వాయిద్యాల శాస్త్రీయ సంగీతం, గానం, కళాకారిణుల శాస్త్రీయ నృత్యం ఏర్పాటు చేశారు. ఆలయంలోని పుష్కరిణిలో అర్చక స్వాములు కాండూరి రాఘవ కృష్ణమాచార్యులు, పెరియాల మాధవాచార్యులు, సత్యదేవాచార్యులు వేదమంత్రాల మధ్య చక్రస్నానం నిర్వహించారు. స్వామివార్లకు ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్నకృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, సభ్యులు శ్రీకాకుళం సాయిరాం, శ్రీనివాసులు, మాజీ చైర్మన్ అనంతుల యాదగిరిరెడ్డి, మేనేజర్ రవికుమార్‌లు స్వామివార్లకు ప్రత్యేక హారతులిచ్చారు స్వామివార్లను పల్లకీసేవలో భక్తులు ఏడు మార్లు చేపట్టిన ఆలయ ప్రదక్షిణ కనులపండువగా జరిగింది. భక్తుల గోవిందనామ ఉచ్చారణల మధ్య స్వామివారు ఉభయ దేవేరులతో ఊరేగారు.



వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చక స్వాములు



ప్రగతి చక్ర అవార్డులతో డ్రైవర్లు, కండక్టర్లను సన్మానిస్తున్న డీఎం హరి

డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతిచక్ర అవార్డుల ప్రదానం

చాదర్‌ఘాట్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో పని చేస్తున్న సిబ్బందిలో అధిక ఆదాయం తీసుకువచ్చిన 10మంది డ్రైవర్లు, కండక్టర్లు ప్రగతి చక్ర అవార్డులకు ఎంపికయ్యారు. సోమవారం దిల్‌సుఖ్‌నగర్ డిపోలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ హరి 10మంది డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్ర అవార్డులను అందజేసి అభినందించారు. దిల్‌సుఖ్‌నగర్ డిపో ఆదాయాన్ని పెంచేందుకు డ్రైవర్లు, కండక్టర్లు సమష్టిగా పనిచేయాలని అప్పుడే వారిలో పోటీతత్వం పెరగడంతోపాటు ఆదాయం కూడా పెరుగుతుందన్న విశ్వాసాన్ని డిపో మేనేజర్ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎన్.వెంకన్న, మెకానికల్ ఫోర్ మెన్ వెంకటేశ్, ఏడీసీలు బుచ్చిరెడ్డి, ఏవీఎస్‌రావుతో పాటు సిబ్బంది పాల్గొని ప్రగతి చక్ర అవార్డులు సాధించిన డ్రైవర్లు, కండక్టర్లను అభినందించారు.

సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబాబునాయక్

ఎల్బీనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడిగా ఆంగోతు రాంబాబునాయక్ మరోసారి ఎంపికయ్యారు. సోమవారం సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌లోని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుని ప్రకటించారు. రాంబాబునాయక్‌కు సేవాలాల్‌సేన త్రిసభ్య కమిటీ చైర్మన్ భక్యా చినబాబునాయక్, ప్రణాళిక కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్‌చందర్‌నాయక్‌లు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబునాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండవసారి సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు త్రిసభ్య కమిటీ సభ్యులకు, రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



రాంబాబునాయక్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ప్రేంచందర్‌నాయక్

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

వనస్థలిపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సోమవారం వనస్థలిపురంలోని ప్రసిద్ధ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా విశ్వహిందు పరిషత్ రాష్ట్ర కార్యదర్శి రవి నూతల శశిధర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశాన్ని మరింతగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మఠం శాంతకుమార్, నాయకులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, గాండ్ల సీనయ్య, నరేందర్ పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న నాయకులు

జాతీయ పారా క్రీడల్లో జోహన్నాకు రజతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ జాతీయ పారా క్రీడల చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ప్లేయర్ జోహన్నా రజతంతో మెరిసింది. గచ్చిబౌలి స్టేడియం లో జరిగిన ఈ పోటీల్లో బాలికల సబ్ జూనియర్ స్విమ్మింగ్‌లో జోహన్నా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, రాష్ట్ర ట్రైథ్లాన్ అధ్యక్షుడు పి.మదన్ మోహన్ విజేతలకు పతకాలు ప్రదానం చేశారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ పీఎస్ పీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేటలో నివాసం ఉంటున్న ఎన్ రామకృష్ణ(33) సోమవారం మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం వెంట నడుచుకుంటూ వెళ్తుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో ఉప్పుగూడ-ఫలక్‌నామా రైల్వే స్టేషన్ల నడుమ సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో 35 ఏళ్ల వయస్సుల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలుదాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సరూర్‌నగర్ ఈద్గా వద్ద బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



ప్రార్థన చేస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే బలాల



అక్బర్‌బాగ్ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు

భక్తి శ్రద్ధలతో బక్రీద్

ఈద్గాలు, మసీదులలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

చాదర్‌ఘాట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధల నడుమ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సలీంనగర్‌లోని ఈద్గాలో ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ, బీఆర్ఎస్ నాయకుడు ఆజంఅలీని మలక్‌పేట పార్టీ ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డి, మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అభిషేకం, నాయకులు గౌర శశిధర్, పవన్, పీటర్ తదితరులు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

సరూర్‌నగర్‌లో..

ఎల్బీనగర్: బక్రీద్ సందర్భంగా సరూర్‌నగర్ ఈద్గా వద్ద ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలకు రాజకీయ నాయకులతో పాటు పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ నాయకుడు బేర బాలకిషన్, సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీధర్‌గౌడ్‌లతో పాటు ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐలు గణేష్ బాబు, మాధవరావు, శ్రీనివాస్‌రావు, సునీల్‌రెడ్డిలు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు సాజిద్, మహ్మద్ జహీర్, కరీం, ఆసీఫ్, షౌకత్, సలీం పాల్గొన్నారు.



ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీసు అధికారులు, రాజకీయ నాయకులు

అక్బర్‌బాగ్, సైదాబాద్‌లలో..

సైదాబాద్: అక్బర్‌బాగ్, మాదన్నపేట ఈద్గాలు, సైదాబాద్‌లోని ప్రార్థన మందిరాలలో వేలాది మంది ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం మతపెద్దలు బక్రీద్ నేపథ్యాన్ని వివరించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. అక్బర్‌బాగ్ ఈద్గాలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

శివార్లలో..

అబ్దుల్లాపూర్‌మెట్: హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఈద్గాలు, మసీద్‌లలో ముస్లింలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, పెద్ద అంబర్‌పేట్, జాఫర్‌గూడ, అనాజ్‌పూర్, మజీద్‌పూర్, ఇనాంగూడ, తారామతిపేట గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఆలింగనం చేసుకుని పరస్పరం బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న బాలలు

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్, తుర్కయంజాల్ పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. హయత్‌నగర్‌లోని చిన్న మసీదు, హయత్ బక్షీ మసీదు, మదర్‌సాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మసీదును సందర్శించి ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.



మాజీ హోం మంత్రి మహమూద్‌అలీని కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ మలక్‌పేట ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డి, మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు చల్లారి రఘునందన్‌రెడ్డి తదితరులు

మీ కాలుకు ముల్లు గుచ్చుకుంటే నా పంటితో తీస్తా

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

వనస్థలిపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ నియోజకవర్గ ప్రజలకు సేవచేయడానికి ఎల్లప్పుడు ముందుంటానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఈటల రాజేందర్‌కు అభినందన కార్యక్రమాన్ని ఎఫ్‌సీఐ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఈటల మాట్లాడుతూ నా విజయాన్ని సువర్ణ అక్షరాలతో లిఖించవచ్చన్నారు. డబ్బు, మద్యాన్ని నమ్ముకున్న వారికి నా విజయం చెంపపెట్టు అన్నారు. మాట ఇచ్చినవాళ్లే గెలిపించినారని, ఓటర్లే నాకు ఓనర్లు అన్నారు. విశ్వాసం, నమ్మకం నామీద ఏవిధంగా పెట్టి గెలిపించారో అదేవిధంగా మీ కోసం కష్టపడి పనిచేస్తానన్నారు. ఎక్కడ సమస్యలున్నా పరిష్కరించడమే నా కర్తవ్యం అన్నారు. పిలుస్తే పలికే నాయకుడినని, మీ కాలుకు ముల్లు గుచ్చుకుంటే నా పంటితో తీస్తానని పేర్కొన్నారు. రాజకీయ నాయకులకు ప్రజలే వీఐపీలు అని, నా మాటలు, చేతలు కొత్తవి కావన్నారు. తాము అనుభవించే పదవులు రాజ్యాంగం కల్పించిన పదవులే అన్నారు. ఎన్నికల వరకే పార్టీలని, అనంతరం అందరూ సమానమేనని తెలిపారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాడిని తనకు సమస్యలు లెక్కకాదన్నారు. ఎల్బీనగర్‌లో త్వరలోనే అభివృద్ధి పనుల ప్రక్రియ మొదలుపెడతామని ఆయన తెలిపారు. అంతకుముందు మన్సూరాబాద్‌లోని ఎంఐరెడ్డి గార్డెన్స్‌లో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు కాచం వెంకటేశ్వర్లు, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, అంజన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



ఈటలను సన్మానిస్తున్న బీజేపీ నాయకుడు శ్రీనివాస్ తదితరులు

బీఆర్ఎస్‌కు 'సామ' గుడ్‌బై..!

● నేడో రేపో కాంగ్రెస్‌లో చేరిక

సరూర్‌నగర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో కౌన్సిలర్‌గా గెలిచి, బడంగ్‌పేట్ నగర పంచాయతీకి నాలుగేళ్ల పాటు చైర్మన్‌గా వ్యవహరించి.. అనంతరం బీఆర్ఎస్‌లో చేరడంతో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 'అవిశ్వాసం'తో పదవి కోల్పోయిన మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు సామ నర్సింహగౌడ్ హస్తం గూటికి చేరనున్నారు. బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పి కాంగ్రెస్‌లో చేరాలని ఆయన నిర్ణయించుకున్నారు. నేడో రేపో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీఎం సమక్షంలోగానీ, నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ సమక్షంలోగానీ ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. మొన్నటిదాకా బీఆర్ఎస్ నాయకుడిగా, తీగల కృష్ణారెడ్డి అనుచరుడిగా కొనసాగిన ఆయన.. ఇటీవల 'తీగల' కారు దిగి హస్తం గూటికి చేరడంతో.. తాను సైతం 'కారు' దిగాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో సోమవారం మీర్‌పేట్‌లోని టీకేఆర్ కాలేజీలో తీగలతో మంతనాలు జరిపిన సామ.. ఎట్టకేలకు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పాలని తుది నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.



సామ నర్సింహగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య తదితరులు

చదువుతోనే బలహీనవర్గాలకు గౌరవం

● ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చదువుకుంటనే ప్రత్యేకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కుల గౌరవం, కుటుంబ గౌరవం పెరుగుతుందని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బడికి పోదాం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీలు తమ పిల్లలను బడికి పంపాలని కోరారు. పిల్లలు చదువుకుంటే భవిష్యత్‌లో వారు డాక్టర్స్, ఇంజనీర్స్, కలెక్టర్స్, ఆఫీసర్స్ అవుతారని గౌరవం పెరుగుతుందని ఆ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటే వారిలో దాగిఉన్న జ్ఞానం, ప్రతిభ బయటకు వస్తాయని, దీని మూలంగా దేశంలో ప్రగతి పథంలో నడుస్తుందని భారతదేశం అగ్రదేశంగా తయారవుతుందన్నారు.

విద్యా ద్వారానే కుల నిర్మూలన జరుగుతుందని, మూఢ విశ్వాసాలు, మూఢ నమ్మకాలు తొలగిపోతాయని, అజ్ఞానం, అంధకారం, అమాయకత్వం నుంచి ప్రజలను విముక్తి చేసి ఒక విజ్ఞానవంతమైన శాస్త్రీయ జ్ఞానంతో కూడిన సమాజం నిర్మాణం చేయగలమన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సౌత్ ఎండ్ పార్క్‌లో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న అధికారులు, కాలనీవాసులు

మూడు సంవత్సరాల తర్వాత ఆర్టీసీ బస్సు పునఃప్రారంభం

● హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు

వనస్థలిపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌లోని కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ బస్సును పునఃప్రారంభించడం హర్షణీయమని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని ప్రెస్ కాలనీ, సౌత్ ఎండ్ పార్క్, సెవెన్ హిల్స్‌కాలనీ, డిపినగర్, చండీశ్వర్‌కాలనీలకు గతంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలు కొనసాగాయి. కాగా మన్సూరాబాద్‌లోని ప్రధాన రహదారుల పక్కన వాహనాల పార్కింగ్, కూరగాయల సంతలు ఏర్పాటు చేయడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిపివేశారు. దీంతో కాలనీవాసులు, ఉద్యోగులు, విద్యార్థులు మూడేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులు తిరిగి పునరుద్ధరించాలని కాలనీవాసులు బండ్లగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్.రమేష్‌కు విజ్ఞప్తి చేశారు. కాలనీల ప్రధాన రహదారులపై వాహనాల పార్కింగ్, కూరగాయాల సంతలు ఏర్పాటు చేస్తే చలాన్లు విధించాలని కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. దీంతో కాలనీవాసులు మూడేళ్ల అనంతరం తమ కాలనీలకు ఆర్టీసీ బస్సులు పునఃప్రారంభం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులు తిరిగి ప్రారంభించడానికి కృషి చేసిన కార్పొరేటర్, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ యాజమాన్యానికి కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాగార్జున, లింగారెడ్డి, విజయపాల్‌రెడ్డి, రాంబాబు, మూర్తి, విజయ, రాములు, పోలెపల్లి చంద్రారెడ్డి, కత్తుల రాంబాబు, అరుణ్‌కుమార్, ఎం.యాదగిరియాదవ్, నరేందర్‌రెడ్డి, కిషన్, శంకర్‌గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



మలక్‌పేట మార్కెట్ ఎదుట ఉన్న రోడ్డుపై వరద ప్రవాహం



మలక్‌పేటలోని అక్షయ హోటల్ పక్క వీధిలోని రోడ్డుపై వరద ప్రవాహం



హయత్‌నగర్ విజయవాడ జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షం

గంటపాటు దంచికొట్టిన వర్షం

● మలక్‌పేట మార్కెట్ ఎదుట ఉన్న రోడ్డుపై వరద ప్రవాహం

● వాహనాల రాకపోకలకు అంతరాయం

చాదర్‌ఘాట్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గంటపాటు దంచికొట్టిన వర్షంతో సోమవారం సాయంత్రం మలక్‌పేటలోని అనేక ప్రాంతాల్లోని రోడ్లన్నీ వరద మయంగా మారాయి. మలక్‌పేట మార్కెట్ ముందున్న న్యూ మార్కెట్ మెట్రోస్టేషన్ రోడ్డుపై వర్షం నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్లపై వరద ప్రవాహం వల్ల ఎక్కడ గుంతలున్నాయో ఎక్కడ మ్యాన్ హోల్‌లు ఉన్నాయోనన్న భయంతో వాహనదారులు రోడ్డు మధ్యలో నుంచే వెళ్లడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. మలక్‌పేట అక్షయ హోటల్ పక్కనున్న రోడ్డు, మలక్‌పేట మార్కెట్‌లోని రోడ్డు వరదతో నిండిపోయింది. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది వరద నివారణకు చేపట్టిన చర్యలతో ట్రాఫిక్ సమస్యలు కొంతవరకు పరిష్కారమైందని స్థానిక వ్యాపారులు వివరించారు.

గోకుల్‌నగర్‌కాలనీ రహదారిని ముంచెత్తిన వరద నీరు

కొత్తపేట: కొత్తపేట డివిజన్ పరిధి గోకుల్‌నగర్ కాలనీ రహదారిని సోమవారం వరద నీరు ముంచెత్తింది. భారీ వర్షం కురిసిన ప్రతీసారీ ఈ దుస్థితి తలెత్తుతోందని కాలనీ ప్రతినిధి ఎస్ లావణ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు, జలమండలి అధికారులకూ సమస్యను విన్నవించామన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కవాడిపల్లిలో రోడ్లపై పారుతున్న వర్షం నీరు

హయత్‌నగర్: హయత్‌నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు మధ్యాహ్నం 4గంటల అనంతరం వాతావరణం చల్లబడి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా కాలనీల్లో రోడ్లు జలమయమయ్యాయి. వరద నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చేరింది. పద్మావతికాలనీ, రాఘవేంద్రకాలనీ, అరుణోదయకాలనీ, బీడీఎల్ కాలనీల్లో భారీగా వరద నీరు ప్రవహించింది. కుమ్మరికుంటలోకి పై కాలనీల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరింది.



పద్మావతి కాలనీలో రోడ్డుపై వరద నీరు

అబ్దుల్లాపూర్‌మెట్ శివారులో

హైదరాబాద్ శివారులోని పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. దీంతో రోడ్లపై భారీగా వరదనీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు వచ్చి చేరింది. పంట పొలాల్లోకి కూడా వర్షం నీరు వచ్చి చేరడంతో మడులు నిండుగా కనిపించాయి.




మన్సూరాబాద్‌లోని ప్రధాన రహదారిపై పడిన గుంతలు

రోడ్లు గుంతలమయం

వనస్థలిపురం/చంపాపేట: ఇటీవల కురుస్తున్న వర్షాలకు వనస్థలిపురం, బీఎన్ రెడ్డినగర్, మన్సూరాబాద్, నాగోల్, చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలోని ప్రధాన రోడ్లపై గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు గుంతలమయం కావడంతో రోడ్లపై వాహనాల రద్దీ పెరిగిపోయి ట్రాఫిక్ జామ్ తీవ్రతరం అవుతుంది. దీంతో రోడ్లపైకి వాహనదారులు రావాలంటేనే జంకుతున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



చంపాపేట డివిజన్‌లోని యాదగిరినగర్‌కాలనీలో గుంతలుగా ఉన్న ప్రధాన రహదారి



సాయిరాంనగర్‌కాలనీలో గుంతలమయంగా ఉన్న రహదారి



బీఎన్‌రెడ్డినగర్ టీచర్స్ కాలనీ ప్రధాన రహదారిపై పడిన గుంతలు